సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

గూడూరు, ఫిబ్రవరి 13 : రాష్ట్రంలో తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలమైందని, రానున్న రోజుల్లో గులాబీ జెండానే ఎగురుతుందని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని వట్టివాగు సమీపంలో వివిధ గ్రామాల కార్యకర్తలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను రైతు భరోసా, రుణ మాఫీ, రైతు బంధు విషయంలో, మహిళలను మహాలక్ష్మీ పథకం విషయంలో మోసం చేసిందన్నారు. నిరుద్యోగులను కూడా నిరాశ పరిచిందన్నారు. ఒక్క ప్రాజెక్టు కాదుకదా ఒక్క ఇల్లు నిర్మించలేదని, ఒక్క ఇటుక పేర్చిన పాపాన పోలేదన్నారు. కానీ ఇప్పటికే రూ.లక్షా 30వేల కోట్లకు పైగా అప్పులు మాత్రం చేశారని ఎద్దేవా చేశారు. కేవలం వంద రోజుల్లోనే హామీలు నెరవేర్చుతామని చెప్పి, 14నెలలైనా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. గులాబీ సైనికులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి, తిరిగి కేసీఆర్‌ను సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గతంలో పార్టీ నుంచి సస్పెండైన మాజీ జడ్పీటీసీ ఎండీ ఖాసీంను తిరిగి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం సంపత్‌రావు, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, నాయకులు ఆకుల రమేశ్, మన్మోహన్ రెడ్డి, బోడ కిషన్, మూడు మోహన్, రహీం, వాంకుడోత్ కతార్‌సింగ్, బానోత్ రామన్న నాయక్, బోడ ఎల్లయ్య, బెజ్జం రమేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

విధుల నుంచి తొలగించాలని తీర్మానం

కార్యాలయం వద్ద అడ్డుకుంటున్న గ్రామస్తులు

మరిపెడ, ఫిబ్రవరి 13 : ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ ఆకుల ఉప్పలయ్యను పంచాయతీ కార్యాలయంలోకి వెళ్లకుండా గ్రామస్తులు అడ్డుకున్న ఘటన గురువారం మండలంలోని నీలికుర్తిలో చోటు చేసుకుంది. అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించాలని గ్రామస్తులందరూ తీర్మానం చేసి, డీఆర్‌డీవోకు అందజేసినా అధికారులు కాలయాపన ఎందుకు చేస్తున్నారని మండిపడ్డారు. మండలంలో ఎక్కువ అవినీతికి పాల్పడిన నీలికుర్తి ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి డబ్బులు రికవరీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి లేని పేద కుటుంబాలకు జాబ్ కార్డును ఫీల్డ్ అసిస్టెంట్ మంజూరు చేయకపోవడంతో 15 కుటుంబాలకు ఆత్మీయ భరోసా పథకం రాకుండా పోయిందన్నారు. అవినీతి ఆధారాలు, రికార్డులు అధికారులకు సమర్పించినా నేటికీ చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఫిల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యం వల్ల గ్రామాభివృద్ధి నిలిచిపోయిందన్నారు. ఇప్పటికైనా అతడిని తొలగించాలని, లేకుంటే ధర్నా చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

డోర్నకల్, ఫిబ్రవరి 13 : విద్యుత్ బకాయిలు వెంటనే చెల్లించాలని డీఈఈ విజయ్ కుమార్ అన్నారు. గురువారం కస్నా తండాలో వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలకు విద్యుత్ మీటర్లు బిగించుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న 200 యూనిట్ల గృహ జ్యోతి పథకం లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ రమేశ్, ఏవో రమేశ్, ఏఈ కిరణ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపు మనదే..

- దొరికినంత దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్

కురవి : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

కురవి, ఫిబ్రవరి 13 : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే గెలుపు మనదే అని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. కురవి మండల కేంద్రంలోని ఓం ఫంక్షన్ హాల్‌లో గురువారం బీఆర్ఎస్ మండల స్థాయి విస్తృత సమావేశం మండల అధ్యక్షుడు తోట లాలయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 420 రోజులు దాటినా కనీసం ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ఫ్రీ బస్సు అంటున్నా బస్సులు ఉండడం లేదని, హౌసింగ్ శాఖ లేకుండానే ఇండ్లు ఇస్తానని అంటున్నారని, ఒకవేళ ఇండ్లు ఇచ్చినా బిల్లులు రావన్నారు. కేసీఆర్ పెట్టిన కల్యాణ లక్ష్మి, మేడిగడ్డ ప్రాజెక్టు, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు ఎన్నికల్లో చెప్పినవి కావన్నారు. ఇప్పుడు మహిళలు కాంగ్రెస్‌పై కోపం, కసితో ఉన్నారని, ఎన్నికల్లో వారి తడాఖా చూపుతారన్నారు. రేవంత్ రెడ్డి వచ్చిండు చెరువుల్లో నీళ్లు, చేపలు లేకుండా పోయాయన్నారు. కేసీఆర్ తెలంగాణ తేకపోతే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేటోడా ? అని ప్రశ్నించారు. 420 హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారన్నారు. ఇప్పుడు ఏ ఎన్నికలు పెట్టినా గెలిచేది బీఆర్ఎస్ పార్టీనే అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. తన 40 ఏళ్ల రాజకీయంలో మంజూరు లేకుండా శంకుస్థాపన చేసింది లేదన్నారు. కానీ, అయ్యగారిపల్లి సమీపంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నిధులు మంజూరు కాకున్నా.. టెండర్ కాకపోయినా స్కూల్‌కు శంకుస్థాపన చేశారన్నారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే తాను గతంలో ప్రారంభించిన బలపాల దవాఖానను మళ్లీ ప్రారంభించారన్నారు. సీరోలులో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి తాను శంకుస్థాపన చేసిన శిలాఫలకం పక్కనే అదే పనికి మళ్లీ శంకుస్థాపన చేశారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, యూత్ రాష్ట్ర నాయకుడు గుగులోత్ రవినాయక్, కురవి సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, అయూబ్‌పాషా, బాదె నాగయ్య, ఐలి నరహరి, నెహ్రూ నాయక్, కిశోర్ వర్మ, కొణతం విజయ్, రాజు నాయక్, రామచంద్రయ్య, గణేశ్, చంద్రారెడ్డి, కృష్ణమూర్తి, యానాల గంగాధర్‌రెడ్డి, వినోద్, రమేశ్, గణేశ్, సూర్య, నామ సైదులు, రొయ్యల నాగేశ్వరరావు, రాంలాల్, గుండోజు శ్రీనివాస్, అమ్రీ, బత్తుల వెంకన్న పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

మరిపెడ : పురపాలక సంఘం పరిధిలోని ఫంక్షన్ హాల్‌లో నాయిని శ్రీనివాస్, పద్మలక్ష్మి చిన్న కూతురు ఈక్షీత–సందీప్ వివాహం గురువారం జరుగగా మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ కోఆప్షన్ మెంబర్ అయాబ్ పాషా తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

మరిపెడ/గార్ల, ఫిబ్రవరి 13: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. మరిపెడ మండంలోని బాల్ని ధర్మారానికి చెందిన ట్రాక్టర్, సూర్యాపేట జిల్లా బిక్కుమల్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పురపాలక సంఘం పరిధిలోని రాజీవ్ గాంధీ సెంటర్‌లో పట్టుకుని, డ్రైవర్లపై కేసు నమోదు చేసిన్నట్లు పేర్కొన్నారు. అలాగే, గార్ల మండలంలోని సత్యనారాయణ పురం అలిగేరు వాగు నుంచి బయ్యారం మండలం సంతులాల్ పోడు తండాకు చెందిన తేజావత్ శ్రీను ఇసుకను ట్రాక్టర్‌లో నింపుకుని వెళ్తుండగా సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై రియాజ్ పాషా తెలిపారు.

ఏడుగురి బైడోవర్

మరిపెడ, ఫిబ్రవరి 13: నిషేధిత గుడుంబాను విక్రయిస్తున్న ఏడుగురిని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బైడోవర్ చేసినట్లు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై తిరుపతి తెలిపారు. మండలంలోని గిరిపురం, పూసలతండా, తండా ధర్మారం, మరిపెడకు చెందిన ఏడుగురు గుడుంబాను విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దాడులు చేసి, వారిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని బైండోవర్ చేసినట్లు వివరించారు.కార్యక్రమంలో సంజీవ, వీరమల్లు, ఖలీల్ పాల్గొన్నారు.

క్రేన్ వైర్ తెగి బావిలో పడి ఇద్దరికి గాయాలు

మరిపెడ, ఫిబ్రవరి 13: క్రేన్ వైర్ తెగి బావిలో పడి ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం మండలంలోని లచ్చతండాలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బాల్నిధర్మారం రెవెన్యూ పరిధిలోని లచ్చ తండాలో వ్యవసాయ బావిలో పూడికతీత పనులు ముగించుకొని పైకి వస్తున్న క్రమంలో క్రేన్ వైర్ తెగి బావిలో పడింది. దీంతో గుగులోత్ వెంకన్న, గుగులోత్ లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వారిని 108 వాహనంలో ఏరియా దవాఖానకు తరలించారు.

రైలు కింద పడి వృద్ధురాలి మృతి

డోర్నకల్, ఫిబ్రవరి 13 : రైలు కింద పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం గార్ల రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకున్నది. జీఆర్‌పీ ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. గార్ల స్టేషన్ దిగువ లైన్‌లో మల్లం సక్కు బాయి(70) పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి మానసిక స్థితి సరిగా ఉండదని స్థానికులు తెలిపారు. రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోడల్ స్కూల్‌లో బియ్యం బస్తాల చోరీ

కేసముద్రం , ఫిబ్రవరి 13 : మండలంలోని కల్వల మోడల్ స్కూల్ వసతి గృహంలో బియ్యం బస్తాల చోరీ జరిగినట్లు ఆర్ఐ సౌజన్య గురువారం తెలిపారు. వసతి గృహంలో విద్యార్థుల కోసం కేటాయించిన బియ్యాన్ని ఓ వ్యక్తి తీసుకెళ్తుండగా స్థానికులు గుర్తించి సమాచారం అందించారని తెలిపారు. ఈ మేరకు స్కూల్‌కు వెళ్లి విచారణ చేయగా వంట చేసే మహిళ తన భర్తతో సుమారు 45 కేజీల బియ్యాన్ని తీసుకెళ్లినట్లు గుర్తించామని పేర్కొన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. ఎస్సై మురళీధర్‌రాజ్ కూడా పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు.

ఆంగ్లంలో ప్రావీణ్యం సాధించాలి

మహబూబాబాద్ రూరల్/డోర్నకల్/మరిపెడ, ఫిబ్రవరి 13 : విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని మాధవాపురం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సంకా బద్రి నారాయణ అన్నారు. సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని గురువారం పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరోజినీ దేవి గొప్ప రచయిత్రి, కవయిత్రి అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగయ్య, పరమాత్మచారి, బాబురెడ్డి పాల్గొన్నారు. అలాగే, సీరోలు మండలం మన్నెగూడెం జడ్పీహెచ్ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో అంగోత్ లక్ష్మా పాల్గొని కాంప్లెక్స్ హెచ్ఎం రుక్మాంధరావుతో కలిసి సరోజినీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎం విత్తనాల సుధాకర్, ఉపాధ్యాయులు ప్రశాంతి, శ్రీధర్, విక్టోరియా, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు. మరిపెడ హైస్కూల్‌లో ఇన్‌చార్జి హెచ్ఎం బయగాని రామ్మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించిన తహసీల్దార్

'నమస్తే' కథనానికి స్పందన

వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ విజయ

బయ్యారం, ఫిబ్రవరి 13 : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తహసీల్దార్ విజయ గురువారం సందర్శించారు. సరిపడా టాయిలెట్స్ లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందిపై 'కస్తూర్బాలో విద్యార్థుల కష్టాలు' అనే శీర్షికతో నమస్తే తెలంగాణ కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన తహసీల్దార్ విజయ పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. బాత్‌రూంలు, మరుగుదొడ్లు లేక రోజూ ఇబ్బంది తప్పడం లేదని విద్యార్థులు తెలిపారు. కాగా, టాయిలెట్స్ నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందించి, ప్రభుత్వానికి నివేదిక పంపామని, సత్వరమే వాటి మంజూరుకు కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. విద్యాలయం ఎదుట మురుగునీరు నిల్వ ఉండకుండా సోప్ ఫిట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో నీలిమ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో సమస్యలు రాకుండా చూస్తాం

మిర్చి యార్డ్‌ను పరిశీలిస్తున్న రవి కుమార్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ అదనపు డైరెక్టర్ రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌ను ఆయన సందర్శించి, కమిటీ సభ్యులతో మాట్లాడారు. ప్రస్తుతం మిర్చికి అంతర్జాతీయ మార్కెట్‌లో ఎగుమతులు లేక ధర తగ్గిందన్నారు. తక్కువ ధర ఉంటే రైతులు మిర్చిని కోల్డ్ స్టోరేజీలో పెట్టుకుని వ్యవసాయ మార్కెట్ అధికారులను సంప్రదించి రుణం పొందవచ్చన్నారు. సిబ్బంది కొరత విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, సెక్రటరీ శంషీర్, సూపర్‌వైజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాలలో ఉద్యాన కళాశాల

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : ఉద్యాన కళాశాలను మల్యాల గ్రామంలోనే ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో కళాశాల భవన నిర్మాణ కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోనే అనుకూల స్థలం సేకరించి, కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం శివారులో శ్రీసంత్ సేవాలాల్ గుడి సైతం ప్రభుత్వం భూమిలోనే ఉందన్నారు.

ఇచ్చిన హామీని అమలు చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను వెంటనే ప్రభుత్వం అమలు చేయాలని జిల్లా ఉద్యమ కారుల ఫోరం అధ్యక్షుడు ఆహ్మద్ ఖాన్ కోరారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమ కారులకు గెలిచిన వెంటనే 250 చదరపు గజాలతో ఇంటి స్థలంను కేటాయించి, వారి కుటుంబాలకు న్యాయం చేస్తామని చెప్పి ఇంత వరకూ అమలు చేయడం లేదన్నారు. వెంటనే ఉద్యమ కారులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో దార్ల శివరాజ్, రామక్రిష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

మూసి ఉన్న పీఏసీఎస్ ఎరువుల గోదాము

యూరియా లేక రైతుల ఇబ్బందులు

నర్సింహులపేట, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రంలో రెండు రోజులుగా యూరియా బస్తాలు లేక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేట్ వ్యాపారులు అధిక ధరకు యూరియా విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అవరమైన యూరియా బస్తాలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

మహిళలను గౌరవించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : మహిళలను గౌరవించడం భారతీయ సంస్కృతి అని సీనియర్ సివిల్ జడ్జి సురేశ్ అన్నారు. గురువారం కోర్టులో జిల్లా న్యాయ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, క్రాంతి కుమార్, వెంకట రెడ్డి, అహ్మద్ ఖాన్, మూబిన్ పాల్గొన్నారు.

అర్థ గణాంక ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : జిల్లా అర్థగణాంక ఉద్యోగుల కార్యవర్గాన్ని టీఎస్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా సుమలత, కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా భాగ్యశ్రీ, కార్యవర్గ సభ్యులుగా వేణు, జగన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రోహిత్, సుబ్బారావు, విజయ లక్ష్మి, కృష్టారావు పాల్గొన్నారు.

వాహనాల వేలంతో రూ.4.23లక్షల ఆదాయం

గూడూరు, ఫిబ్రవరి 13 : పట్టుబడిన వాహనాలకు ఎక్సైజ్‌శాఖ గురువారం నిర్వహించిన వేలంలో ప్రభుత్వానికి రూ.4,23,104 ఆదాయం వచ్చినటు ఎక్సైజ్ సీఐ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధి కొన్ని నెలల క్రితం గుడుంబా, బెల్లం, పటిక తరలిస్తున్న ద్విచక్ర వాహనాలను వేలం వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్, ఎస్సై రాజేశ్వరి, సిబ్బంది పాల్గొనారు.

విషవాయువులతో గ్రామస్తులు ఉక్కిరిబిక్కిరి

ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న పోలీసులు

మరిపెడ, ఫిబ్రవరి 13 : విద్యా హెర్బల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే విషవాయువుల వల్ల మరిపెడ గ్రామస్తులు గురువారం రాత్రి ఉక్కిరిబిక్కిరి కావడంతో గ్రామంలో గందరగోళం నెలకొంది. గ్రామ సమీపంలోని ఫ్యాక్టరీలో ఎండు మిర్చి ప్రాసెస్ చేసి, ఆయిల్‌ను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి ఫ్యాక్టరీ నుంచి వెలువడిన వాయువుల కారణంగా చుట్టు పక్కల మూడు, నాలుగు కిలోమీటర్ల పరధిలో గాలి కలుషితమై గ్రామస్తులకు ఒంటి మీద మంటలు, శ్వాస సమస్యలు ఏర్పడ్డాయి. చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో గ్రామస్తులు 100కు డయల్ చేయడంతో స్థానిక పోలీసులు వచ్చి, ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి దాన్ని బంద్ చేయించారు. గతంలో కూడా గ్రామస్తులు ఇబ్బందులు పడితే ఫ్యాక్టరీని బంద్ చేయించడంతో యాజమాన్యం గ్రామస్తులతో మాట్లాడి మిర్చి ఘాటు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. అయినా ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ విషవాయువులు వెలువడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంద పడకల దవాఖాన కోసం పోరు

తొర్రూరు ఫిబ్రవరి 13 : పట్టణంలో వంద పడకల దవాఖాన నిర్మాణం కోసం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర నాయకుడు సమ్మెర విశ్వేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, సీపీఎం జిల్లా నాయకుడు బొల్లం అశోక్ అన్నారు. తొర్రూరులో మూడు పార్టీల నాయకులు సమావేశం నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా ఆందోళనలు చేస్తామన్నారు.

విద్యార్థులతో ఇటుకలు మోయిస్తున్న ఉపాధ్యాయురాలు

చిట్టి చేతులతో మట్టి పనులు!

కేసముద్రం, ఫిబ్రవరి 13 : చిన్నారులకు విద్య నేర్పాల్సిన ఉపాధ్యాయులు వారి చిట్టి చేతులతో పనులు చేయించిన ఘటన మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్నది. ప్రాథమిక పాఠశాల ప్రహరీ ఇటీవల కూలిపోయింది. అయితే, ప్రహరీ ఇటుక పెళ్లలను తీయాలని ఉపాధ్యాయులు సూచించడంతో చిన్నారులు వాటిని తీసుకొచ్చి పాఠశాల ఆవరణలోనే ఒక్క దగ్గర పేర్చారు. ఇటుక పెళ్లలతో పాటు బండలు సైతం తీయించారు. ఉపాధ్యాయులు దగ్గరుండి విద్యార్థులతో పనులు చేయించారు. చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులు రెండు రోజులుగా ఇలా చిన్న పిల్లలతో పనులు చేయించడంపై విమర్శలు వస్తున్నాయి.

గూడూరు : మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తల్లులకు ప్రణమిల్లిన భక్త జనం

చింతలగట్టు వద్ద జన సందోహం

గూడూరు, ఫిబ్రవరి 13 : మండలంలోని మచ్చర్ల, అప్పరాజుపల్లి గ్రామాల మధ్య చింతలగట్టు వట్టివాగు సమ్మక్క సారలమ్మ తిరుగువారం(మినీ) జాతరకు భక్తులు గురువారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రణమిల్లారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లుల గద్దెలకు మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో పూజారులు, వడ్డెలు, బాధ్యులు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవార్ల గద్దెలను మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు దారం సిద్ధూ, కారం లక్ష్మయ్య, తాటి సుధాకర్, దారం నరేశ్, వాసం రమేశ్, జాతర కమిటీ అధ్యక్షుడు పెనుక నాగయ్య, ప్రధాన కార్యదర్శి వాసం సహదేవులు, వాసం భద్రయ్య, ననప వీరస్వామి, పూనెం జనార్దన్, దారం సాంబరాజు, వీరభద్రం, అశోక్ పాల్గొన్నారు.

కస్నాతండా క్రాస్‌రోడ్డులో..

డోర్నకల్ : కస్నా తండా క్రాస్ రోడ్డు వద్ద మీని మేడారం జాతర రెండో రోజు కొనసాగింది. తల్లులను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

'ఈ కార్యదర్శి మాకొద్దు'

కురవి, ఫిబ్రవరి 13 : విధులకు సక్రమంగా హాజరుకాకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్న పంచాయతీ కార్యదర్శి మాకొద్దంటూ మండలంలోని గుండ్రాతిమడుగు విలేజ్ వాసులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం గ్రామంలో గ్రామస్తులు సమావేశమై మాట్లాడుతూ కార్యదర్శి రాము ఇటీవల విధులకు సక్రమంగా రావడం లేదని, ఎవరైనా అడిగితే బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, కార్యదర్శిని మార్చాలని కోరారు. కాగా, రాజకీయ ఒత్తిడితోనే తనను ఇబ్బంది పెడుతున్నారని కార్యదర్శి రాము తెలిపారు. ఓ ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

గార్ల/కురవి, ఫిబ్రవరి 13 : శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఈ నెల 15న అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్ సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు గురువారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు. అలాగే, కురవిలో జరిగిన సమావేశంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకుడు మాలోత్ కిషన్‌నాయక్ మ్లాడాడుతూ ఈ నెల 15 నుంచి 20 వరకు సేవాలాల్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవా, సురేశ్, రాజు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సహకరించాలి

డోర్నకల్/కురవి, ఫిబ్రవరి 13 : స్థానిక సంస్థల ఎన్నికలకు రాజకీయ నాయకులు సహకరించాలని డోర్నకల్ ఎంపీడీవో శ్రీనివాసరావు కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందు అధికారులకు సహకరించాలన్నారు. ఎంపీవో మీర్జా మున్వర్ బేగ్, నాయకులు భూక్యా శ్రీనివాస్, సుమీర్ చంద్ జైన్, విజయ్ కాంత్ పాల్గొన్నారు. అలాగే, సీరోలు మండలంలోని రాజకీయ నాయకులతో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎండీ గౌస్ తన కార్యాలయంలో సమావేశం నిర్వహించార